# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 05-12-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత్ - రష్యా దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడుల వృద్ధిలో వేగం పెంచేందుకు ఇరు దేశాలు కృషి చేస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.
- ❖ దేశంలో సహకార రంగం పరిధిని విస్తరించడానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని కేంద్రమంత్రి అమిత్ షా అన్నారు.
- ❖ హెల్త్ సెక్యూరిటీ సే నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది.
- ❖ భారత్ - దక్షిణాఫ్రికా జట్ల మధ్య చివరి వన్డే క్రికెట్ మ్యాచ్ రేపు విశాఖలో జరగనుంది.

====================

భారత్ - రష్యా దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులను పెంచే లక్ష్యంతో 2030 ఆర్థిక సహకార కార్యక్రమానికి ఇరుదేశాలు అంగీకరించాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు. ఢిల్లీలో ఈరోజు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో జరిపిన ద్వైపాక్షిక సమావేశం అనంతరం ఇరువురు నేతలు సంయుక్తంగా పాత్రికేయుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరేంద్ర మోదీ మాట్లాడుతూ... రెండు దేశాల మధ్య ప్రాధాన్య రంగాలు, దీర్ఘకాలిక ఆర్థిక సంబంధాల వృద్ధిలో వేగం పెంచేందుకు ఇరు దేశాలు కృషి చేస్తున్నాయన్నారు. శాంతి స్థాపనతోనే దేశాలు పురోగమిస్తాయని తెలిపారు. భారత్ - రష్యాలు కలిసికట్టుగా ప్రపంచాన్ని శాంతి మార్గంలో నడిపిస్తాయని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

సంస్కరణ, పనితీరు, పరివర్తన విధానాల ద్వారా భారతదేశం ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. ఇండియా-రష్యా బిజినెస్ ఫోరమ్‌లో ప్రధానమంత్రి మాట్లాడుతూ.. భారతదేశం, యురేషియన్ ఎకనామిక్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య

ఒప్పందంపై చర్చలు ఇప్పటికే ప్రారంభమయ్యాయని అన్నారు. వ్యాపారంలో, దౌత్యంలో భాగస్వామ్యానికి పునాది పరస్పర విశ్వాసం అని, ఈ నమ్మకం భారత్-రష్యా సంబంధాలకు గొప్ప బలం అని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 9వ తేదీన న్యూఢిల్లీలో 2023 - 24 సంవత్సరానికి గాను జాతీయ హస్తకళల అవార్డులను ప్రదానం చేస్తారని కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో ఈరోజు తెలిపింది. జాతీయ హస్తకళల వారోత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో జౌళి శాఖా మంత్రి గిరిరాజ్ సింగ్, ఆ శాఖ సహాయ మంత్రి పబిత్ర మార్గరీటలు కూడా పాల్గొంటారని పేర్కొంది. ఈ అవార్డులు అసమానమైన కళాత్మక నైపుణ్యాన్ని గుర్తించడంతో పాటు, దేశ విభిన్నమైన గొప్ప హస్తకళ వారసత్వాన్ని పరిరక్షించడానికి, ప్రోత్సహించడానికి ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతను పునరుద్ఘాటిస్తాయని మంత్రిత్వ శాఖ వెల్లడించింది. భారతదేశ కళాకారులకు నివాళిగా హస్తకళల శాశ్వత సాంస్కృతిక ప్రాముఖ్యతను తెలియజేసేందుకు ప్రతి సంవత్సరం డిసెంబర్ 8 నుండి జాతీయ హస్తకళల వారోత్సవాన్ని జరుపుకుంటారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ఇండిగో విమాన సర్వీసులు పెద్దఎత్తున రద్దవుతుండటంతో తలెత్తిన సంక్షోభంపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు నిర్ణయించినట్టు పౌర విమానయాన శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. దీనికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. భవిష్యత్‌లో ఇలాంటి అంతరాయాలు తలెత్తకుండా, ప్రయాణీకులకు ఇబ్బంది కలకుండా చూస్తామని వివరించింది. ప్రయాణీకుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ లేదని, ముఖ్యంగా వృద్ధులు, విద్యార్థులు, పేషెంట్లు, ఇతరులు ముఖ్య అవసరాల కోసం ప్రయాణాలు సాగిస్తుంటారని, వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాల్సి ఉంటుందని పేర్కొంది. విమాన సర్వీసులు రేపటి నుంచి తిరిగి ప్రారంభమవుతాయని అంచనా వేస్తున్నామని, మూడు రోజుల్లోగా పూర్తిగా పునరుద్ధిస్తామని తెలిపింది. మెరుగైన ఆన్‌లైన్ వ్యవస్థల ద్వారా విమానయాన సంస్థలు క్రమం తప్పకుండా, ఖచ్చితమైన సమాచారాన్ని అందించాలని, ప్రయాణీకులు తమ ఇళ్ల నుండే సమాచారాన్ని తెలుసుకునేల వీలు కల్పించాలని ఆదేశించింది.

= = = = = = = = = = = = = = = = = = = =

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. రాజ్యసభలో ఈరోజు ప్రశ్నోత్తరాల సమయంలో అనుబంధ ప్రశ్నలకు కేంద్రమంత్రి సమాధానమిస్తూ... భారత ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం వెన్నెముక అని తెలిపారు. ప్రభుత్వం వ్యవసాయ రంగంలో వ్యయాలను తగ్గించడం, ఉత్పత్తిని పెంచడం, ఉత్పత్తులకు సరసమైన ధరలను నిర్ధారించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించిదని శివరాజ్ సింగ్ చౌహాన్ వివరిస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

రేపో రేటును 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గిస్తున్నట్లు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ముంబైలో ఈరోజు పాత్రికేయులకు ఆయన తెలియజేశారు. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) సంస్కరణలతో కొనుగోళ్లు పెరగడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో 8.2 శాతం వృద్ధి నమోదైందని తెలిపారు. దీంతో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ వృద్ధి రేటు అంచనాలను 6.8 శాతం నుంచి 7.3 శాతానికి పెంచుతున్నామని అన్నారు. ఆరుగురు సభ్యుల కమిటీ వడ్డీ రేట్ల తగ్గింపునకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందని.. దీంతో రెపో రేటు 5.25 శాతానికి వచ్చిందని సంజయ్ మల్హోత్రా తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో సహకార రంగం పరిధిని విస్తరించడానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని కేంద్ర సహకార శాఖా మంత్రి అమిత్ షా అన్నారు. గాంధీనగర్‌లోని మహాత్మా మందిర్‌లో ఈరోజు జరిగిన నాబార్డ్-ఐఏఎంఏఐ ఎర్త్ సమ్మిట్ -2025 ప్రారంభోత్సవ కార్యక్రమంలో అమిత్ షా మాట్లాడుతూ... దేశ వ్యాప్తంగా త్వరలో కోఆపరేటివ్ టాక్సీ, కోఆపరేటివ్ ఇన్సూరెన్స్, కోఆపరేషన్ అమాంగ్ కోఆపరేటివ్స్ ప్రాజెక్ట్ వంటి కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలను బలోపేతంతోనే వికసిత్ భారత్ కల సాకారం అవుతుందన్నారు. రాబోయే సంవత్సరాల్లో దేశ జీడీపీకి సహకార రంగం సహకారాన్ని మూడు రెట్లు పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. 'కోఆపరేషన్ అమాంగ్ కోఆపరేటివ్స్' ప్రాజెక్ట్ అన్ని సహకార సంస్థలు సహకార బ్యాంకులలో ఖాతాలను నిర్వహించేలా చూస్తుందని అమిత్ షా వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

హెల్త్ సెక్యూరిటీ సే నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్లును లోక్‌సభ ఈరోజు ఆమోదించింది. పాన్ మసాలా వంటి వస్తువుల ఉత్పత్తులపై సెస్ విధించి తద్వారా ఆరోగ్యం, జాతీయ భద్రతకు నిధులను పెంచడం ఈ బిల్లు లక్ష్యం. ఈ బిల్లుపై ఈరోజు జరిగిన చర్చలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రజలకు హాని చేసే వస్తువుల వాడకాన్ని నిరోధించాలని కోరుకుంటోందని అన్నారు. ఈ తరహా వస్తువులు, ఉత్పత్తులపై వసూలు చేయబడిన సెస్‌ను ప్రజారోగ్యం, రక్షణ, పర్యావరణ వ్యవస్థలను బలోపేతం చేయడానికి ఖర్చు చేస్తామని తెలిపారు. ఈ బిల్లు నుండి వచ్చే ఆదాయాన్ని నిర్దిష్ట ఆరోగ్య పథకాల కోసం రాష్ట్రాలతో పంచుకుంటామని చెప్పారు. 40 శాతం GSTతో పాటు, పాన్ మసాలా యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యంపై ఆరోగ్యం, జాతీయ భద్రతా సెస్ విధించబడుతుందని కేంద్రమంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

భారత్ - దక్షిణాఫ్రికా జట్ల మధ్య మూడు వన్డేల క్రికెట్ సిరీస్ చివరి దశకు చేరుకుంది. నవంబర్ 30న రాంచీలో ఇరు జట్ల మధ్య జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 17 పరుగుల తేడాతో విజయం సాధించగా, ఈ నెల 3 వ తేదీన రాయ్‌పుర్‌లో జరిగిన రెండో వన్డేలో దక్షిణాఫ్రికా 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. దీంతో రెండు మ్యాచ్‌లు ముగిసే సరికి సిరీస్ 1 - 1తో సమం అయ్యింది. విశాఖపట్టణంలో ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదికగా చివరి వన్డే క్రికెట్ మ్యాచ్ రేపు మధ్యాహ్నం ఒంటి గంటా 30 నిమిషాలకు ప్రారంభం కానుంది. సిరీస్ గెలవాలంటే ఈ మ్యాచ్ ఇరు జట్లకు ఎంతో కీలకం.

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =